సాక్షి
మంచిర్యాల

గురువారం । 26 । జూన్ । 2025



బోనాల పండుగకు వేళాయె

నేటి నుంచి ఆషాఢమాసం ప్రారంభం కానుంది. గ్రామాల్లో డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకుంటాయి. గ్రామాల్లో ఊరేగింపుగా బోనాలు తీస్తారు. 8లో▸



నస్పూర్‌లో ఆర్టీవో సేవలు

నస్పూర్ పట్టణంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు సింగరేణి క్వార్టర్లకు మరమ్మతులు చేస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో 17.4 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం వరకు 17.4 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో 20.5 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 7.1, లక్సెట్టిపేటలో 10.3, హాజీపూర్‌లో 14.3, కాసిపేటలో 20.4, తాండూర్‌లో 24.9, భీమినిలో 43.2, కన్నెపల్లిలో 24.3, వేమనపల్లిలో 16.9, నెన్నెలలో 19.2, బెల్లంపల్లిలో 24.4, మందమర్రిలో 12.4, మంచిర్యాలలో 10.2, నస్పూర్‌లో 10.8, జైపూర్‌లో 13.2, భీమారంలో 16.4, చెన్నూర్‌లో 13.6, కోటపల్లిలో 10.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లా సాధారణ వర్షపాతం 133.2మి.మీ కాగా 74.9మిల్లీమీటర్లు నమోదైంది. ఇంకా 43శాతం లోటు నెలకొంది.

జూలై 9న దేశ వ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న వీ.సీతారామయ్య

శ్రీరాంపూర్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య తెలిపారు. బుధవారం ఆయన ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి వల్ల కార్మికవర్గం తమ హక్కులు కోల్పోనుందని తెలిపారు. ఈ నెల 27న సింగరేణి యాజమాన్యంతో డైరెక్టర్(పా) స్థాయిలో స్ట్రక్చరల్ సమావేశం జరుగుతుందని, కార్మికుల సాధారణ మరణానికి కుటుంబాలకు రూ.10 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరుతామని అన్నారు. ఈ సమావేశంలో యూనియన్ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, నాయకులు ప్రసాద్‌రెడ్డి, అద్దు శ్రీనివాస్, గండి సతీశ్, శేఖర్, ఫిట్ సెక్రెటరీ మారుపల్లి సారయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, ఆకుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే క్షయ వ్యాధి నివారణ సాధ్యం

బెల్లంపల్లిరూరల్: అప్రమత్తతతోనే క్షయ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి సుధాకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామంలో జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణులకు బీపీ, షుగర్, హెచ్‌ఐవీ, హెపటైటిస్, క్షయ, రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా దగ్గు వస్తే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి తెమడ ద్వారా క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లగురిజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎవంజలీన్, జుబేయర్, ఎన్‌హెచ్‌పీ జిల్లా ఇంచార్జీ మధుబాబు, సీఎస్‌వో రాజ్, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, హెచ్‌ఈవో గంగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇటీవల తనపై జరిగిన దాడిపై పట్టణ బీఆర్‌ఎస్వీ నాయకుడు దగ్గుల మధుకుమార్ బుధవారం బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌కుమార్‌లతో కలిసి మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. గత ఏడాది సెప్టెంబర్ 17న మంచిర్యాలలోని ఓ హోటల్‌లో ఉండగా 20మంది దాడి చేశారని, ఈ నెల 19న మరోసారి దాడి చేసి గాయపర్చారని, ఈ దాడుల్లో కాంగ్రెస్ పార్టీ, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుతో అనుబంధంగా ఉన్నవారే పాల్గొన్నారని పేర్కొన్నారు. పోలీసులు కనీస విచారణ చేయకుండానే బాధితుడు మధుకుమార్‌పైనే కేసు నమోదు చేశారని తెలిపారు. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయగా ఎమ్మెల్యే ప్రభావంతో వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చారని పేర్కొన్నారు. మానవ హక్కుల కమిషన్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అటవీ శాఖలో పదోన్నతులు

మంచిర్యాలక్రైం: అటవీ శాఖలోని డీఆర్‌వోలకు ఎఫ్‌ఆర్‌వోలుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు హైదరాబాద్ సీసీఎఫ్‌ఓ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని దేవాపూర్ డీఆర్‌వో సతీష్‌కుమార్‌కు ఎఫ్‌ఆర్‌వోగా పదోన్నతి కల్పిస్తూ పెద్దపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు. మంచిర్యాల సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ విభాగం డీఆర్‌వో ఎండీ.హఫీజొద్దీన్‌కు ఎఫ్‌ఆర్‌వోగా పదోన్నతి కల్పిస్తూ బెల్లంపల్లిలోని సీల్వాయికి పోస్టింగ్ ఇచ్చారు. జిల్లాలోని వెంకటాపూర్, చెన్నూర్ డీఆర్‌ఓ ఏ.సుభాష్‌కు ఎఫ్‌ఆర్‌వోగా పదోన్నతి కల్పిస్తూ భూపాలపల్లిలో పోస్టింగ్ ఇచ్చారు.

నిలిచి గెలవండి..!

- చదువుకునే వయస్సులో బలవన్మరణాలు
- స్కూల్, కాలేజీ విద్యార్థుల ఆత్మహత్యలు
- ఆందోళన కలిగిస్తున్న తొందరపాటు నిర్ణయాలు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన వయస్సులో ఉసురు తీసుకుంటున్నారు. కన్న తల్లిదండ్రులకు తీరని శోకం మిగుల్చుతున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలో పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. చిన్న చిన్న కారణాలకే బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఉజ్వలమైన భవిష్యత్‌ను క్షణికావేశంలో కోల్పోతున్నారు. మరోవైపు చిన్న వయస్సులోనే ఈ మరణాలు సమాజంపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

క్షణికావేశం.. తొందరపాటు

కుటుంబ పెద్దలు, నిరుద్యోగులు, రైతులు అనేక కష్టాలు, ఆర్థిక సమస్యలు ఎదుర్కొని కొంత జీవితం అనుభవించాక దిక్కుతోచని పరిస్థితుల్లో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడేవారు. ఇటీవల స్కూల్, కాలేజీ విద్యార్థులు సైతం చిన్న కారణాలకే తనువు చాలిస్తున్నారు. టీనేజీలోనే ఆకర్షణలకు లోనవుతున్నారు. అబ్బాయి, అమ్మాయిల మధ్య మనస్పర్థలు వస్తే తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇక కొందరు చదువు ఇష్టం లేక ఒత్తిడికి గురవుతున్నారు. పది, ఇంటర్, బీటెక్ వంటి పరీక్షల్లో ర్యాంకు రాలేదని, ఫెయిల్ అయ్యామని, చదువులో రాణించలేకపోతున్నామని తదితర కారణాలతోనూ ఎంతో భవిష్యత్ ఉన్న వారంతా అర్ధంతరంగా కన్నవారికి దూరమవుతున్నారు.

లోపమెక్కడ?

పిల్లల పట్ల బాధ్యత వహించాల్సింది ముఖ్యంగా తల్లిదండ్రులేనని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. బాల్యం నుంచే పిల్లల నడవడి, తీరు, అలవాట్లు, ఆలోచనలు అంచనా వేస్తూ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో అండగా నిలవాలని పేర్కొంటున్నారు. ఒత్తిడి చదువులు, వారి భావాలకు విరుద్ధంగా వ్యవహరించడం, అతి క్రమశిక్షణ, అతిగా స్వేచ్ఛ ఇవ్వడం ప్రమాదమని సూచిస్తున్నారు. పోషకులుగా తమ పిల్లల ఆలనాపాలనా చూస్తూ, వారి మానసిక స్థితి, ఆలోచనలకు విలువ ఇస్తూ బంధాలను బలోపేతం చేసుకోవాలని చెబుతున్నారు. సమస్యను పంచుకుని బాధలు తీర్చే సంరక్షకులుగా ఉంటే పిల్లలు మానసికంగా ఇబ్బంది పడరని అంటున్నారు. చదువుతోపాటు ఇష్టమైన రంగాల్లో రాణించేలా, గెలుపోటములు సమానంగా స్వీకరించేలా తీర్చిదిద్దాలని, నాయకత్వ లక్షణాలు అలవర్చాలని, క్లిష్ట పరిస్థితులను తట్టుకునేలా మనోధైర్యం నింపాలని, జీవితంలో నిలిచి గెలవాలని సూచిస్తున్నారు.

మానసికంగా దృఢంగా ఉండాలి



గతంలో బోధకులు, విద్యార్థుల మధ్య సత్సంబంధాలు ఉండేవి. చాలా చోట్ల ఇప్పుడా పరిస్థితి లేదు. ఆత్మహత్య చేసుకుంటున్న వారు అధికంగా వ్యక్తిగత, ప్రేమ విఫలం, ఫెయిలవడం, తల్లిదండ్రులు మందలించారనే ఆవేశంలో నిర్ణయం తీసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులను తట్టుకునే విద్యార్థులు బాల్యం నుంచే కష్ట, సుఖాలు ఎదుర్కొనే స్థితిలో మానసికంగా దృఢంగా ఉండాలి. – పల్లె భూమేశ్, చైర్మన్, శ్రీహర్ష విద్యాసంస్థలు

క్షణికావేశంతో బలవన్మరణాలు



తొందరపాటులో అనాలోచిత నిర్ణయాలతో బలవన్మరణాలు జరుగుతున్నాయి. జీవితంలో అన్నింటిని సమంగా చూసే స్థితిలో చాలామంది లేరు. విద్యార్థులు తమ జీవితంలో వ్యక్తిగతంగా, విద్యాపరంగా, కుటుంబంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం వెతకాలి. ఎంతో భవిష్యత్ ఉన్న జీవితాన్ని అర్ధంతరంగా ముగించుకోవద్దు.

– అంబాల సమ్మయ్య, సైకాలజిస్టు

లేత వయస్సు మరణాలు..

- నస్పూర్ పరిధి షిర్కే కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని సెకండియర్ ఫెయిల్ అయ్యానని మనస్తాపంతో ఇంట్లోనే ఉరేసుకుని తనువు చాలించింది.
- దండేపల్లికి చెందిన విద్యార్థి ఇంటర్ పూర్తి చేయగా.. బీటెక్ చదవడం ఇష్టం లేదంటూ.. పై చదువులకు వెళ్లనంటూ ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.
- లోకేశ్వరం మండలం బిబోలికి చెందిన ఓ విద్యార్థి ఇటీవల పదో తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియెట్‌కు బదులు వేరే కోర్సు చేస్తానని చెప్పగా.. తండ్రి మందలించడంతో తట్టుకోలేక క్రిమి సంహారక మందు తాగి చనిపోయాడు.
- లక్సెట్టిపేట పట్టణానికి చెందిన ఓ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అంతలోనే ఉరేసుకుంది.
- తాజాగా మంచిర్యాలలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఓ విద్యార్థిని భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ ఏ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్‌లతో కలిసి పోలీసు, రవాణా, రోడ్డు భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. మిషన భగీరథ అధికారులు పైప్‌లైన్ మరమ్మతుల సమయంలో ముందస్తు సమచారం అందించాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో కూరగాయల మార్కెట్ కోసం స్థలాన్ని గుర్తించాలని, రహదారులు, కూడళ్ల వద్ద కూరగాయల విక్రయాన్ని నివారించి ట్రాఫిక్ రద్దీని తగ్గించాలని తెలిపారు. మంచిర్యాల పట్టణం, నస్పూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు

- ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి
- కేసీఆర్ కుటుంబంపై తీవ్ర విమర్శలు



జైపూర్‌లో మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి, వేదికపై కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కమీషన్ల కోసమే కట్టారని, వేలాది కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని రాష్ట్ర కార్మిక, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి విమర్శించారు. బుధవారం ఆయన జైపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో జైపూర్, ఇందారం, టేకుమట్ల, రామారావుపేట, ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల చెన్నూర్ నియోజకవర్గానికి నీటిబొట్టు కూడా రాలేదని, ప్రాజెక్టును నాసిరకంగా నిర్మించి వందల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలే నిలదీస్తారని అన్నారు. మూడేళ్లుగా ప్రాజెక్టులోకి నీళ్లు రావడం లేదని, ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ కారణంగా 40వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని, ప్రాజెక్టు మూలంగా రైతులకు నష్టమే మిగిలిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో మూడు వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్లు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక మాఫియా విచ్చలవిడిగా నడిచిందని, ప్రజల సొమ్ము దోపిడీ చేశారని విమర్శించారు. ప్రజలు స్వంత అవసరాలకు ప్రభుత్వ ఇసుక రీచ్‌ల ద్వారా సులభతరంగా పొందవచ్చని అన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కూపన్ల ద్వారా ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ప్రభుత్వం

చెన్నూర్/చెన్నూర్‌రూరల్/భీమారం: పేదల పక్షాన నిలబడేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం చెన్నూర్ క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. స్థానిక రాజీవ్ రోడ్డులో రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. చెన్నూర్ మండలం సుబ్బరాంపల్లి, కిష్టంపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమి పూజలో పాల్గొన్నారు. భీమారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎవరు ఇళ్లు ముందుగా నిర్మించుకుంటే వారి ఇంటి గృహ ప్రవేశానికి హాజరై భోజనం చేసి వెళ్తానని అన్నారు. ఇళ్ల మంజూరు కోసం ఎవరికీ లంచాలు ఇవ్వొద్దని కోరారు. భీమారంలో కేజీబీవీలో రూ.66లక్షలతో అదనపు డార్మెటరీ గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో మధుసూదన్ పాల్గొన్నారు.



సుబ్బరాంపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

ప్రశ్నించే వారిపై దాడులు, కేసులు


- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పాలనలో లా అండ్ ఆర్డర్ ఉన్నట్టా లేనట్టా.. ప్రశ్నించే వారిపై దాడులు చేసి కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంచిర్యాల, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య అన్నారు. ఇటీవల మంచిర్యాలలో బీఆర్‌ఎస్వీ నాయకుడు దగ్గుల మధుకుమార్‌పై జరిగిన దాడిపై బుధవారం రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝాకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై దాడులు, కేసులు నమోదు చేస్తున్నారని, మంచిర్యాలలో 20 మందిపై తప్పుడు కేసులు నమోదు చేశారని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, లా అండ్ ఆర్డర్ పూర్తిగా నిర్వీర్యమైందని అన్నారు. కిందిస్థాయి పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని, పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఫ్రెండ్లీ పోలీసింగ్ చేశామని, ఇలాంటి దాడులు మళ్లీ జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. మంచిర్యాలలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు గ్యాంగ్ అరాచకాలు మితిమీరుతున్నాయని, దాడులు మళ్లీ జరిగితే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

‘ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చరిత్ర కాంగ్రెస్‌దే’



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

మంచిర్యాలటౌన్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని, 1975లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ 50 ఏళ్లు పూర్తి చేసుకుందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాలలో ఎమర్జెన్సీ ర్యాలీ నిర్వహించారు. ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు పెద్దపల్లి పురుషోత్తం, ముల్కల్ల మల్లారెడ్డి, కొయ్యల ఏమాజి, మున్నారాజా సిసోడియా, దుర్గం అశోక్, బియ్యాల సతీశ్‌రావు, ఆకుల అశోక్‌వర్ధన్, ఎనగందుల కృష్ణమూర్తి, మోటపలుకుల తిరుపతి, పానుగంటి మధు, మోటపలుకుల గురువయ్య, గాజుల ముఖేశ్‌గౌడ్, మల్యాల శ్రీనివాస్, గుండా ప్రభాకర్, గాదె శ్రీనివాస్, జోగుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం.. సవాలే!

- ‘హస్తం’లో గ్రూపు విభేదాలు
- నామినేటెడ్, పార్టీ కమిటీల ఏర్పాటులో జాప్యం
- ముంచుకొస్తున్న ‘స్థానిక’ సమరం
- నేడు ఆదిలాబాద్‌కు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ‘జూపల్లి’ రాక
- రెండ్రోజులపాటు ఇక్కడే మకాం
- ఆయన వెంట మంత్రి వివేక్ సైతం..





మంత్రి కృష్ణారావు



మంత్రి గడ్డం వివేక్

సాక్షి,ఆదిలాబాద్: ‘పార్టీకి కీలకమైన కార్యకర్తలను నిరాశపర్చొద్దు.. సమన్వయంతో ముందుకు సాగాలి.. ప్రభుత్వ పదవులను శ్రేణులకు ఇప్పించడంలో జాప్యం అయితే ప్రయోజనమేంటి.. ఆలయ, మార్కెట్ కమిటీలు వంటి పదవులు నేరుగా నేను ఇవ్వలేను.. ఇన్‌చార్జి మంత్రులు, షార్ట్‌లిస్ట్ చేసి పంపితే ఫైనల్ మాత్రమే చేయగలుగుతాను.. నామినేటెడ్‌తో పాటు పార్టీ కమిటీలు ఇవ్వడంలో ఇక ఆలస్యం వద్దు.. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జాబితాలను పార్టీకి పంపాలి.. అది జరిగితే త్వరగా ఫైనల్ చేయవచ్చు..’ ఇది సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన టీపీసీసీ పీఏసీ భేటీలో అన్న మాటలు. ప్రస్తుతం ఇవి ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రధానంగా ఇన్‌చార్జి మంత్రులకు ప్రస్తుతం పార్టీ పరంగా వీటన్నింటిని సరిదిద్ది, గాడిన పెట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్నారు. నేడు, రేపు ఆయన ఇక్కడే ఉండనున్నారు. ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షతో పాటు వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొననున్నారు. అలాగే ఇన్‌చార్జి మంత్రికి తొలుత పార్టీ సంస్థాగత నిర్మాణం, నామినేట్ పదవుల పందేరం, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడం ముందున్న బాధ్యత. సీఎం ఈ విషయంలో ఇన్‌చార్జి మంత్రులు దృష్టి సారించాలని ఆదేశించడం ప్రస్తుతం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో పార్టీ కమిటీల ఏర్పాటుపై ఆయన తక్షణం దృష్టి సారించాల్సిన పరిస్థితి. అలాగే పార్టీలో గ్రూపు విభేదాలతో పాటు పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయం కరువైంది. ఈ క్రమంలో మంత్రి వీటన్నింటిని ఎలా గాడిలో పెడతారనేది ఆసక్తికరం. ప్రధానంగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా కార్యకర్తల్లో తాము అధికారంలో ఉన్నామన్న ఉత్సాహం కనిపించడం లేదు. అధికారుల వద్ద తమ పనులు కాకపోవడం కూడా ఈ నిరాశకు కారణం. ఈ నేపథ్యంలో పార్టీలో ఉత్సాహం తీసుకురావడం ప్రస్తుతం ఇన్‌చార్జి మంత్రికి కీలకం కానుంది.

సమన్వయం సాధించేనా..

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రతీ నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతల మధ్య విభేదాలు ఉన్నాయి. గ్రూపు రాజకీయాలు పెరిగిపోయాయి. పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయ లోపం ఉంది. గతంలో ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించిన సీతక్క వీరందరినీ సమన్వయ పర్చడంలో విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అంతే కాకుండా ఆమె అసలు పట్టించుకోలేదని నేరుగా జిల్లా నేతలు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ముందు ఇటీవల నిర్వహించిన సమావేశాల్లో ప్రస్తావించారు. ఆ సమయంలోనే తాను ఉమ్మడి ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరించలేనని, తప్పుకుంటానని, విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని అప్పట్లోనే ఆమె పేర్కొనడం గమనార్హం. ఆ తర్వాత పరిణామ క్రమంలో నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా వ్యవహరిస్తున్న మంత్రి జూపల్లిని ఆదిలాబాద్‌కు, సీతక్కను నిజామాబాద్‌కు మార్చారు. ఈ పరిస్థితుల్లో మంత్రి జూపల్లి తొలిసారిగా జిల్లాకు విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో సమన్వయం ఎలా సాధించాలనే విషయంలో ఆయన ఎలా ముందుకెళ్తారనేది ప్రస్తుతం కీలకం. ఇక చెన్నూర్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న గడ్డం వివేక్ వెంకటస్వామి రాష్ట్ర మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. మంత్రి హోదాలో ఆయన కూడా గురువారం నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి రానున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్ష పదవి రెండున్నరేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో జిల్లాలో పార్టీకి దిక్సూచి లేని పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్‌లో పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన నేతలు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆడే గజేందర్, శ్యామ్‌నాయక్ ఆయా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్నారు. ఖానాపూర్‌లో ఎమ్మెల్యేగా గెలిచిన వెడ్మ బొజ్జు ప్రస్తుతం ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏకైక కాంగ్రెస్ ప్రజాప్రతినిధిగా ఉన్నారు. ఇక నిర్మల్ జిల్లాకు డీసీసీ అధ్యక్షుడిగా శ్రీహరిరావు వ్యవహరిస్తున్నారు. సీనియర్ నేత, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీహరిరావు మధ్య పార్టీ పరంగా సరైన సంబంధాలు లేవు. ముధోల్ నియోజకవర్గంలో సీనియర్ నేతలు బోస్లే నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డి మధ్య సఖ్యత కరువైంది. ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మధ్య కూడా ఇదే పరిస్థితి. కుమురంభీం జిల్లాలోనూ పార్టీ నేతల మధ్య విభేదాలున్నాయి. సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఇటీవల మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌కు తాను దూరంగా ఉంటానని ప్రకటించారు. ప్రధానంగా ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ విఠల్‌తో విభేదాల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, దండే విఠల్‌కు మధ్య కూడా సఖ్యత లేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ మధ్య విభేదాలున్నాయి. ఇక మంచిర్యాల జిల్లాలో ఎమ్మెల్యేల మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయి. ఇటీవల మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు వ్యాఖ్యలు దుమారం లేపాయి. ప్రధానంగా ‘నా నియోజకవర్గానికి నేనే రాజు.. నేనే మంత్రినని’ ఆయన పేర్కొనడం పార్టీలో విభేదాలను స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వివేక్ ఈ వ్యవహారంలో ఎలా ముందుకెళ్తారనేది చూడాల్సిందే. ఇలా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితులను ఇన్‌చార్జి మంత్రి ఎలా సరిదిద్దుతారనే విషయంలో పార్టీ శ్రేణులు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

క్లుప్తంగా

లాసెట్‌లో వడ్డాడి వాసికి 90వ ర్యాంక్


సిరిగిరి ప్రవీణ్

తాంసి: మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన సిరిగిరి ప్రవీణ్ లాసెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 90వ ర్యాంక్ సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన మల్లయ్య, లలిత దంపతుల కుమారుడైన ప్రవీణ్ చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. ప్రస్తుతం డిగ్రీ బీఏతో పాటు ఎల్ఎల్‌బీ సైతం పూర్తి చేశాడు. లాసెట్‌లో ఎల్ఎల్ఎం కోసం పరీక్షకు హాజరు కాగా రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించాడు. గ్రామస్తులతో పాటు పలువురు అభినందించారు.

కుక్కలదాడిలో చుక్కలదుప్పి మృతి

కోటపల్లి: వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందిన సంఘటన మండలానికి సమీపంలోని పాలవాగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. చెన్నూర్, కోటపల్లి మధ్యలోని అటవీ ప్రాంతంలో ప్రధాన రహదారిపైకి వచ్చిన చుక్కలదుప్పిని అక్కడే ఉన్న వీధి కుక్కలు వెంటాడి తీవ్రంగా గాయపరిచాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమేసి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దుప్పిని చెన్నూర్ పశువైద్యశాలకు తరలించగా పశువైద్యాధికారి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అటవీశాఖ అధికారి స్వప్న, డీఆర్వో ప్రభాకర్‌కు సమాచారం అందించడంతో అటవీ ప్రాంతంలో ఖననం చేస్తామని తీసుకెళ్లారు.

ముగ్గురి రిమాండ్

తానూరు: దాడి కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన ఇస్తెకర్ సిద్దిరాంపై అదే గ్రామానికి చెందిన ప్రదీప్, రమేశ్, దినేశ్ దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు బుధవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అస్లం వద్ద బుధవారం మూడు బ్యాగుల్లో 50 కిలోల రాయితీ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం వన్‌టౌన్‌లో నమోదైన కేసులో ఇద్దరు నిందితులు గూగుల్‌వార్ రాజేశ్వర్, షేక్ అయ్యూను రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులు శివాజీ చౌక్‌లో బ్రాండెడ్ రైస్ బ్యాగుల్లో రాయితీ బియ్యాన్ని నింపి ప్రజలను మోసగిస్తున్నారని వివరించారు.

బోనాల పండుగకు వేళాయె

- నేటి నుంచి ఆషాఢమాసం ప్రారంభం
- ఊరుకట్టడితో ప్రత్యేక పూజలు
- డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు
- వనభోజనాలు, గోరింటాకు సంబురాలు


విద్యార్థుల గోరింటాకు సంబురాలు (ఫైల్)


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో బోనాల సందడి షురూ కానుంది. ఈనెల 26 నుంచి నెలరోజుల పాటు డప్పు చప్పుళ్ల పోతరాజుల విన్యాసాలు శివసత్తుల సిగాలు, కళాకారుల ఆటపాటలు, డీజే హోరుతో వాడవాడలు మార్మోగనున్నాయి. బోనాల జాతర సంస్కృతి సంప్రదాయలను కొనసాగించడమే కాదు... ఆర్థిక కోణంలోనూ అనేక మందికి ఉపాధి కల్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఊరు కట్టడి ఆనవాయితీ. మహిళలు మెహందీ (గోరింటాకు)తో మురిసిపోతుంటారు. గురువారం ప్రారంభమయ్యే ఆషాఢమాసంపై ప్రత్యేక కథనం..

ఊరుకట్టడి ఇలా..

గ్రామీణ ప్రాంతాల్లో పాడి పంటలు, పిల్లాపాపలు, పశుసంపద సల్లంగా ఉండాలని కోరుతూ గ్రామస్తులంతా ఏకమై ఊరు కట్టడి చేస్తారు. పూజలు పూర్తయ్యేంత వరకు గ్రామస్తులెవరూ బయటకు వెళ్లరు. బయటి వ్యక్తులను గ్రామంలోకి రానీయరు. గ్రామ దేవతలైన పోచమ్మ, భూలక్ష్మి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేకలను బలిఇస్తారు. పోతరాజు గావుపట్టి ఊరు చుట్టూ తిరుగుతూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

బోనాలతో ఊరేగింపుగా వెళ్లి..

ఆషాఢమాసంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మతల్లికి బోనాలు సమర్పిస్తారు. జిల్లా కేంద్రమైన మంచిర్యాలలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తారు. ముదిరాజ్ కులస్తులంతా కలిసి బోనాలతో బయలుదేరి అమ్మవారిని దర్శించుకుంటారు. హమాలీవాడ పోచమ్మ చెరువు సమీపంలోని మండేలయ్యకు రజకులు, గౌడ కులస్తులు ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. తాటి, ఈత వనంలో తమకు మంచి జరగాలని గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లికి బోనాలు సమర్పిస్తారు.

మహిళలకు గోరింటాకు పండుగ..

ఆషాఢమాసం వచ్చిందంటే మహిళలు, యువతులు, పిల్లల చేతులు గోరింటాకుతో కళకళలాడుతుంటాయి. రుతువు మారినవేళ గోరింటాకు పెట్టుకుంటే కాళ్లు, చేతులు గోళ్లు శుభ్రపడుతాయని రోగనిరోధకంగా అంటూ వ్యాధులను దూరం చేస్తుందని నమ్మకం. ఒకప్పుడు గోరింటాకు ముద్దలుగా చేసి ఇంటిల్లిపాది చేతులు, కాళ్లకు పెట్టుకునే వారు. పట్టణ ప్రాంతాల్లో మెహందీగా వివిధ ఆకృతుల్లో తీర్చిదిద్దటానికి కొంతమందికి ఉపాధి మార్గంగా మారింది. విద్యాసంస్థల్లో గోరింటాకు విశిష్టతను తెలిపేలా విద్యార్థులకు అవగాహన కల్పిస్తుంటారు. బాలికలు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గోరింటాకు సంబురాలు నిర్వహిస్తారు.

పండుగతో ఉపాధి..

బోనాల పండుగ ఉపాధికి ఊతమివ్వనుంది. ప్రత్యేకంగా పోతరాజుల విన్యాసాలకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ఇతర ప్రాంతాలకు చెందిన కళాకారులు మంచిర్యాల ప్రాంతాలకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తారు. బోనం సమర్పించేందుకు కుండలు ఎంతో అవసరం. నైవేద్యం సమర్పించే కుండతో పాటు దానిపై ఉండే చిన్న చిన్న బుడ్డిదీపం పెట్టే ముంత కలిపి ఒక సెట్‌లాగా ఉంటుంది. ఈ సమయంలో కుమ్మరులు బిజీగా ఉంటారు. డప్పులు వాయించే వారి నుంచి డీజేల వరకు ఉపాధి పొందనున్నారు. బోనం అలంకరణకు అవసరమైన పూల వ్యాపారం ఊపందుకుంటుంది. హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు పూలను సిద్ధం చేస్తారు. మేకలు, కోళ్లకు భలే డిమాండ్ ఉంటుంది. పండుగ ఇలా ఎందరికో ఉపాధి తెచ్చి పెడుతుంది.

ఓపెన్ స్కూల్ ఓ వరం..

- చదువు మానేసిన వారికి మంచి అవకాశం
- పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు ప్రారంభం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 84 కేంద్రాలు

ఉమ్మడి జిల్లా సమాచారం

జిల్లా	అధ్యయన కేంద్రాలు	చేర్పించాల్సిన లక్ష్యం
నిర్మల్	25	2,506
ఆదిలాబాద్	22	1,696
మంచిర్యాల	17	1,974
కుమురంభీం	20	902
మొత్తం	84	7,078


ఓపెన్ స్కూల్‌లో పాఠం వింటున్న విద్యార్థులు

లక్ష్మణచాంద(నిర్మల్): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల వల్ల పాఠశాల స్థాయిలోనే పలువురు విద్యార్థులు చదువు మధ్యలోనే మానేస్తున్నారు. మరి కొందరు పదోతరగతి పూర్తయిన తరువాత ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో ఇంటర్ చదువు కొనసాగించలేకపోతున్నారు. ఇలాంటి వారి కోసం తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) మళ్లీ చదువుకునే అవకాశం కల్పిస్తోంది. చదువు మధ్యలో మానేసిన విద్యార్థులు మళ్లీ చదువు కొనసాగించేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఓపెన్ స్కూల్, ఓపెన్ ఇంటర్ ఓ సువర్ణ అవకాశంగా చెప్పవచ్చు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓపెన్ పదోతరగతి, ఓపెన్ ఇంటర్ అధ్యయన కేంద్రాలు 84 ఉన్నాయి. వాటిలో 7,078 మందికి ప్రవేశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఓపెన్ తరగతుల్లో ప్రవేశాల కోసం ఎలాంటి విద్యార్హత లేదు. కనీస వయస్సు 15 ఏళ్లు నిండి ఉండాలి. ఆపై వయస్సు గల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌లో ప్రవేశాల కోసం తప్పనిసరిగా పదో తరగతి పాసై ఉండాలి. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జూన్ 12 నుంచి జూలై 11 వరకు ప్రవేశం పొందవచ్చు. టీజీ ఆన్‌లైన్‌లో మీసేవ కేంద్రంలో ఫీజు చెల్లించి సమీపంలోని ఓపెన్ స్కూల్‌లో దరఖాస్తులు సమర్పించి అడ్మిషన్ తీసుకోవాలి. ఓపెన్ స్కూల్‌లో ఈ నెల 25 బుధవారం వరకు మొత్తం 71 దరఖాస్తులు వచ్చినట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి ఆదిలాబాద్ కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు. ఇందులో ఓపెన్ పదో తరగతికి ఉమ్మడి జిల్లాలో 47 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 34 మంది అడ్మిషన్ ఫీజు చెల్లించారని పేర్కొన్నారు. ఓపెన్‌లో ఇంటర్‌లో సైన్స్ విభాగంలో 20 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో ఇప్పటి వరకు ఆరుగురు విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించారని, ఆర్ట్స్ విభాగంలో ఇప్పటి వరకు 41 మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో 31 మంది అడ్మిషన్ ఫీజు చెల్లించారని తెలిపారు.

సెలవుల్లో తరగతులు...

ఓపెన్ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది. వీరికి సెలవుల రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. రెండో శనివారం, ఆదివారం, ఇతర సెలవులు ఉన్న రోజుల్లో తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు అధ్యయన కేంద్రాల్లోనే అందజేస్తారు.

రెండోరోజూ బాధితుల ఆందోళన

పెంచికల్‌పేట్: అగర్‌గూడ గ్రామానికి చెందిన తుమ్మిడే రాజశేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఎల్కపల్లిలోని రాచకొండ కృష్ణ ఇంటి ఎదుట గ్రామస్తులు చేపట్టిన ఆందోళన బుధవారం రెండో రోజుకు చేరుకుంది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్‌రావు, సీపీఐ నాయకులు మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ మృతుని కుటుంబానికి తనవంతుగా రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తానని హామి ఇచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు చేసిన మానసిక వేధింపులతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు. ఎరువుల దుకాణాల్లో విజిలెన్సు తనిఖీలు నిర్వహించి అక్రమాలకు పాల్పడిన వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం మాట్లాడుతూ లైసెన్సు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీశ్, ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జైరాం కోరారు. మృతికి సంతాపంగా మండల కేంద్రంలోని వ్యాపార సముదాయాలు బంద్ పాటించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ రూరల్, కౌటాల సీఐ శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

నిందితుడి అరెస్టు..

అగర్‌గూడ గ్రామానికి చెందిన రాజశేఖర్ ఆత్మహత్యకు కారణమైన ఎల్కపల్లి గ్రామానికి చెందిన రాచకొండ కృష్ణను హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెంచికల్‌పేట్ ఎస్సై కొమురయ్య తెలిపారు.

విషాదంలో అగర్‌గూడ..

గ్రామంలో అందిరితో కలిసి మెలిసి ఉండే రాజశేఖర్ ఆత్మహత్యకు పాల్పడటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుని తండ్రి శ్రీనివాస్ మూడేళ్ల క్రితం చనిపోయాడు. చేతికి అందివచ్చిన కొడుకు ఆత్మహత్యకు పాల్పడంతో తల్లి లక్ష్మీ రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

కార్మికులపై వేధింపులు మానుకోవాలి

- హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్


కార్మికులతో మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: తమమాట వినలేదన్న కారణంతో అధికారులు కార్మికులను వేధించడం మానుకోవాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ లోని ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. అధికారుల తప్పిదాలను ప్రశ్నిస్తే షిఫ్టులు మార్చి వేధింపులకు గురి చేస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. పని స్థలాల వద్ద కార్మికులకు తాగునీటి సదుపాయం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులతో కోల్ ఫిల్లింగ్ పనులు చేయిస్తూ వేతనం మాత్రం ఒకటో కేటగిరీ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. జన్మభూమి పేరుతో కార్మికులపై అదనపు పని భారం మోపుతున్నారన్నారు. సమయానికి మ్యాన్‌రైడింగ్ నడుపకపోవడంతో కార్మికులు కాలినడకతోనే గనిలోకి దిగాల్సి వస్తుందన్నారు. కొంతమంది అధికారులు కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, వారిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు శశిధర్, గంగెపెల్లి కమలాకర్, నర్సింగరావు, తదితరులు యూనియన్‌లో చేరగా వారికి కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు జక్కుల నారాయణ, తిప్పారపు సారయ్య, గొల్ల సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్, నాయకులు దుర్గం లక్ష్మణ్, రేగుంట సందీప్, తుల అనిల్ కుమార్, చెవుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై మనోహర్

ఉట్నూర్‌రూరల్: ముగ్గురు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. ఒడిస్సాకు చెందిన ఉజ్జల్, పార్థా, స్వరూప్ ఆదిలాబాద్‌లో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. బుధవారం మూడు కిలోల గంజాయిని ఉట్నూర్‌లో అమ్మేందుకు ఆదిలాబాద్ నుంచి బస్సులో వచ్చారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు ఆర్టీసీ బస్టాండు వద్ద వారిని తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బంగారం దుకాణంలో చోరీ

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లాలో ఇటీవల దొంగతనాలు పెరిగిపోయాయి. రాత్రి, పగలు తేడా లేకుండా దుకాణాలు, ఇళ్లలో చొరబడుతున్నారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీలో గల గంగయ్య అండ్‌సన్స్ సిల్వర్ మర్చంట్‌లో చోరీ జరిగింది. దుకాణం యజమాని, పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాప్ యజమాని రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు షటర్‌ను గడ్డపారతో పైకి లేపి లోనికి ప్రవేశించారు. కౌంటర్‌లో ఉన్న కిలో వెండి, తులం బంగారం అపహరించారు. బుధవారం ఉదయం దుకాణం యజమాని వచ్చి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, క్లూస్ టీం సీసీటీవీని పరిశీలించగా ఇద్దరు దొంగలు తమ ఆనవాళ్లు కనిపించకుండా ముఖానికి టవల్ కట్టుకుని చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

శాంతినగర్ కాలనీలో ఆటో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వివరాల్లోకి వెళితే.. శాంతినగర్ కాలనీకి చెందిన విష్ణువర్ధన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తన ఇంటి ఎదుట ఆటోను నిలిపి ఉంచాడు. బుధవారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో కనిపించ లేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాదవశాత్తా.. ఆత్మహత్యాయత్నమా?

- కళాశాల భవనం పైనుంచి కిందపడి విద్యార్థినికి గాయాలు


స్వప్న

మంచిర్యాలక్రైం: కళాశాల భవనం పైనుంచి కిందపడడంతో విద్యార్థినికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుమురంభీం జిల్లా బెజ్జూర్ మండలం మార్థిడి గ్రామానికి చెందిన కుమ్మరి లచ్చన్న, సుక్కవ్వ దంపతుల రెండో కుమార్తె స్వప్న జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ మహిళా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం రాత్రి కళాశాల భవనంపై నుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కాగా స్వప్న ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందా? లేక ప్రమాదవశాత్తు కిందపడిందా? అనేది తేలాల్సి ఉంది. కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. సీఐ ప్రమోద్‌రావుని వివరణ కోరగా ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. తోటి విద్యార్థులను విచారించగా ఆరేసిన డ్రెస్‌లు తెచ్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడిందన్నారు.

గ్వాలియర్-ఎస్ఎంవీటీ రైలు ప్రారంభం

బెల్లంపల్లి: గ్వాలియర్-ఎస్ఎంవీటీ (సర్ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభం కానుంది. గురువారం గ్వాలియర్‌లో అధికారులు పచ్చజెండా ఊపి ప్రారంభించనున్నారు. ఈనెల 29 నుంచి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా ఈ రైలు ఎస్ఎంవీటీ బెంగళూరు నుంచి ప్రారంభం కానుండగా గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, కాజీపేట, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం కల్పించారు. దిగువ మార్గంలో బెంగళూరు వైపు వెళ్లేటప్పుడు 11086 నంబర్‌తో వెళ్తుంది. బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రతీ శనివారం ఉదయం 11:08 గంటలకు వచ్చి 11:10 నిమిషాలకు బయలుదేరుతుంది. ఎగువ మార్గంలో ప్రతీ సోమవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌కు ఉదయం 8:43 నిమిషాలకు వచ్చి 8:45 నిమిషాలకు బయలుదేరుతుంది. కాగా మంచిర్యాల, రామగుండం, పెద్దపల్లి జంక్షన్‌లో నిలుపుదల లేదు.

సుబేదార్ గంజ్...చర్లపల్లి వీక్లీ ఎక్స్‌ప్రెస్

సుబేదార్ గంజ్-చర్లపల్లి (రైలు నెం.04121/04122) మధ్య మరో వీక్లీ ప్రత్యేక రైలు గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈ రైలు జులై 31 వరకు నడిపించనున్నారు. ఈ ప్రత్యేక రైలుకు సిర్పూర్ కాగజ్‌నగర్, మంచిర్యాల, పెద్దపల్లి, కాజీపేట జంక్షన్‌లో నిలుపుదలకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

- పొక్లెయిన్‌ను ఢీకొన్న కారు
- ఇద్దరు యువకులు దుర్మరణం


అనిల్ మృతదేహం


ఆర్యన్ ముండే మృతదేహం


సంఘటన స్థలంలో నుజ్జునుజ్జయిన కారు

గుడిహత్నూర్: అతి వేగం రెండు ప్రాణాలు బలిగొంది. రెండు కుటుంబాల్లో విషాధం నింపింది. అతివేగంగా వచ్చిన కారు పొక్లెయిన్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు జైనూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్యన్ ముండే (19), ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన గాయక్వాడ్ అనిల్ (21) ఇద్దరు స్నేహితులు. మంగళవారం రాత్రి కారులో వెళ్తుండగా గుడిహత్నూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై వైజాపూర్ యూటర్న్ వద్ద పొక్లెయిన్‌ను అతివేగంగా ఢీకొట్టారు. గాయక్వాడ్ అనిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు కొనఊపిరితో ఉన్న ఆర్యన్‌ముండేను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ఎవరికీ తెలియకుండా పయనం..

ఆర్యన్ ముండే, గాయక్వాడ్ అనిల్ మంచి మిత్రులు. ఆర్యన్ ముండే స్వస్థలం మహారాష్ట్రలోని బోధిడి. తన అమ్మమ్మ ఊరైన జైనూర్‌లో ఉంటూ తాత వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఎవరికీ తెలియకుండా ఇంటి బయట ఉన్న కారు తీసుకుని ఉట్నూర్ ఎక్స్‌రోడ్డుకు వచ్చి తన మిత్రుడు గాయక్వాడ్ అనిల్‌కు ఫోన్ చేశాడు. దీంతో అనిల్ తన ఇంటి నుంచి స్కూటీపై ఏందా ఎక్స్‌రోడ్డు వద్దకు వచ్చాడు. స్కూటీని వదిలి ఆర్యన్‌తో కారులో ఆదిలాబాద్ వైపు బయలు దేరారు. మృతదేహాలకు బుధవారం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వై.మధుకృష్ణ తెలిపారు.

'సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి'


వైద్యాధికారితో మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

గుడిహత్నూర్: పీహెచ్‌సీలో ఎలాంటి సమస్యలున్నా తమదృష్టికి తీసుకు రావాలని ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తా అన్నారు. ఇటీవల స్థానిక పీహెచ్‌సీలో పసికందుపై సీలింగ్ ఫ్యాన్ ఊడిపడ్డ ఘటన నేపథ్యంలో బుధవారం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారి శ్యాంసుందర్‌ను అడిగి ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో లక్షల విలువైన వైద్యోపకరణాలు చిన్నచిన్న సమస్యలతో మూలనపడి ఉన్నాయని, వాటికి మరమ్మతులు చేస్తే రోగులకు ఇక్కడే మెరుగైన వైద్యం అందిస్తామని, తాగునీటి సమస్య ఉందని చెప్పడంతో పీవో సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేస్తానన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: మాదక ద్రవ్యాల నిర్మూలనకు జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద జిల్లాలో డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు అర్హత, అనుభవం కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-అనుదన్ (http://grants-msje.gov.in/ngo-login) పోర్టల్‌లో ఈ నెల 30లోగా వివరాలు నమోదు చేసుకుని దరఖాస్తును జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గాయాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తాటిచెట్టు పైనుంచి కిందపడి గీతకార్మికుడికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లికి చెందిన కోట బుచ్చాగౌడ్ బుధవారం తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతుండగా అదుపుతప్పి కిందపడి పోయాడు. తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.